నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 21 ఆగస్టు 2024 | SURYAPET

డీసీసీబీలో 58 శాతం మందికే రుణమాఫీ

మంత్రి కోమటిరెడ్డి ఇలాకాలో 61శాతమే

- చాలా సహకార సొసైటీల్లో 50శాతానికి తక్కువే
- బ్యాంకుల్లో స్పష్టతకు మరికొద్ది రోజులు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆర్అండ్బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇలాకాలో వేలాది మంది ఇలాగే రుణ మాఫీకి దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్ ఆచరణలో అనేక కొర్రీలు పెడుతూ లబ్ధిదారుల సంఖ్యను సగానికి సగం తగ్గించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్‌కార్డు ప్రమాణికంగా కుటుంబంలో గరిష్టంగా రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపచేయడంతో భారీగా కోత పడిందన్నది నిజం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీసం 6 లక్షల మంది రుణమాఫీకి అర్హులు ఉంటారని ప్రారంభంలో అంచనా వేయగా, మూడు దశల్లో కలిపి అది కేవలం 3.39లక్షల మందికే పరిమితమైంది. దాంతో మిగతా రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. బాధితులు బ్యాంకులు, సహకార సొసైటీలు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం బ్యాంకుల్లో ఇంకా స్పష్టత రాకపోవడంతో 'నమస్తే తెలంగాణ' సహకార సొసైటీలపై కేంద్రీకరించి రుణమాఫీపై ఆరా తీసింది. నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రుణమాఫీపై లెక్కలను తీసుకుంటే.. కేవలం 58.63శాతం మంది రైతులకే రెండు లక్షల రుణమాఫీ వర్తించినట్లు స్పష్టమైంది. కావాల్సిన రుణమాఫీ మొత్తంలో 55.95 శాతమే అవడం గమనార్హం. బ్యాంకు అధికారుల లెక్కల ప్రకారమే మొత్తం డీసీసీబీ పరిధిలోని 107 సొసైటీల పరిధిలో రుణమాఫీకి అర్హులైన రైతులు 89,888 మంది ఉండగా, అందులో 2 లక్షల రుణమాఫీ అయిన రైతుల సంఖ్య 52,708 మాత్రమే. 37,180 మంది రుణమాఫీకి నోచలేదు. వీరికిగానూ మొత్తం 499.98కోట్ల రుణమాఫీ లబ్ధి జరుగుతుందని అంచనా వేయగా ఇందులో 279.76 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా రూ.220.22కోట్ల రుణాల మాఫీ గురించి స్పష్టత లేదు. క్షేత్రస్థాయిలో జిల్లా కేంద్రానికి సంబంధించిన పానగల్ సహకార సొసైటీని పరిశీలిస్తే ఇందులో పెద్దఎత్తున రుణమాఫీ కాని వాళ్లే కనిపించారు. పానగల్ సొసైటీ అధికారుల లెక్కల ప్రకారం.. మొత్తం 1,274 మంది రైతులను రుణమాఫీకి అర్హులుగా తేల్చారు. అందులో రూ.లక్ష వరకు 501 మందికి, లక్షన్నర వరకు 211 మందికి, 2లక్షల వరకు 70 మందికే రుణమాఫీ వర్తించింది. ఇంకా 492 మందికి వివిధ కారణాలు చూపుతూ రుణమాఫీకి దూరం చేశారు. వారంతా శనివారం సాయంత్రానికి కూడా జాబితాపై ఇంకా స్పష్టత రాలేదు. సోమవారం నాటికి జాబితాలో పేర్లు లేకుంటే అందుకు కారణాలు తెలుసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మునుగోడు పీఏసీఎస్‌ను పరిశీలిస్తే... 245 మందికి రుణమాఫీ కాలేదు. ఇక్కడ మొత్తం 591 మంది అర్హులు ఉండగా 366 మందికే రుణమాఫీ వర్తించడం గమనార్హం. రేషన్ కార్డు లేకపోవడం, అకౌంట్ నెంబర్లల్లో తప్పుల కారణంగా రుణమాఫీ కాలేదని సొసైటీ సీఈఓ పాలకూరి సుఖేందర్‌గౌడ్ తెలిపారు. అనుముల మండలం కొత్తపల్లిలో పరిశీలిస్తే మొత్తం 1,326 మంది అర్హులు ఉండగా, కేవలం643 మందికే రుణమాఫీ అయ్యింది. 683కి ఇంకా కాలేదు. మొత్తం 7.50కోట్లకు గానూ 3.13 కోట్లే రుణాలు మాఫీ అయ్యాయి. దామరచర్ల పీఏసీఎస్‌లో మొత్తం 821 మంది రుణాలు పొందగా, అందులో 515 మందికే రుణమాఫీ జరిగింది. 2 లక్షల రుణమాఫీ కేవలం 38 మందికే అవడం గమనార్హం. కొండమల్లేపల్లి పీఏసీఎస్‌లో మొత్తం 973 మందికి గానూ 648 మందికి మాత్రమే కాగా 325 మంది రుణమాఫీకి దూరమయ్యారు. శాలిగౌరారం పీఏసీఎస్‌లో మొత్తం 379 మందికి గానూ 180 మందికే రుణమాఫీ జరిగి 199 మందికి అవలేదు. మిర్యాలగూడ పీఏసీఎస్‌లో మొత్తం 652 మంది రైతులు ఉండగా 445 మందికి కాగా 207 మందికి కాలేదు. ఇలా ఏ సొసైటీని పరిశీలించినా 40 నుంచి 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీనిపై డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కొందరి ఆధార్ కార్డులు, కొందరి పేర్లు, కొందరి రేషన్ కార్డుల తప్పిదాల వంటి సాంకేతిక సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వారం రోజులు స్పెషల్ డ్రైవ్‌తో వాటిని పరిష్కరించి రుణమాఫీ అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మరోవైపు రుణమాఫీ వర్తించని వారి నుంచి దరఖాస్తులు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. బ్యాంకు లేదా రైతువేదికల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండి రైతుల నుంచి వివరాలు సేకరించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రవణ్‌కుమార్ వెల్లడించారు.

కుటుంబంలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు...

ఈ రైతు పేరు ముదిరెడ్డి శేఖర్‌రెడ్డి. ఊరు నల్లగొండ మండలం చిన్నసూరారం. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నాడు. ఐదున్నర ఎకరాల సాగు భూమి ఉంది. వ్యవసాయం కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు. తల్లి పేరున లక్ష రూపాయలు రుణం ఉంది. ఈయన పేరు లక్షా 60 వేలు ఉంది. వీరందరికీ ఒకటే రేషన్‌కార్డు ఉంది. అయినా ఈయనకు గానీ, తల్లికి గానీ రుణమాఫీ కాలేదు. కారణం ఏంటో తెల్వక ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి వస్తే కారణమేంటో అక్కడ కూడా ఎవరూ చెప్పలేదు. దీనిపై రైతు ముదిరెడ్డి శేఖర్‌రెడ్డి స్పందిస్తూ.. తమ కుటుంబంలో ఒక్కరికైనా రుణమాఫీ అవుతుందనుకున్నట్లు చెప్పారు. కానీ ఒక్కరికీ రాలేదని, రాకపోవడానికి కారణం కూడా తెలియడం లేదని వాపోయాడు. చేస్తే అందరికీ చేయాలి గానీ, ఏవో షరతులు పెట్టి తమలాంటి రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఏంటని ప్రశ్నించారు. మూడో విడత రుణమాఫీ జాబితాలు బ్యాంకుల వద్ద గానీ, సొసైటీల వద్ద గానీ పూర్తి స్థాయిలో లభించకపోవడంతో రెండు, మూడ్రోజుల్లో స్పష్టత రావచ్చని తెలుస్తున్నది.

ట్రామా కేర్ సెంటర్‌కు స్థల పరిశీలన

పామనుగుండ్లలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కట్టంగూర్, ఆగస్టు 20 : క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కోసం మండలంలోని పామనుగుండ్ల గ్రామ శివారులోని స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజుల్లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని, అందుకు సంబంధించిన వివరాలు సేకరించడంతో పాటు హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గుర్తించిన స్థలాన్ని చదును చేయాలని తాసీల్దార్ గుగులోతు ప్రసాద్‌ను ఆదేశించారు. పామనుగుండ్ల గ్రామంలో జరుగుతున్న జ్వరసర్వేతో పాటు పారిశుధ్యం, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను కార్యదర్శి జయసుధను అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలి

- డాక్టర్లు, సిబ్బంది వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, ఆగస్టు 20 : ప్రతి ప్రైవేట్ హాస్పిటల్‌లో డాక్టర్, ఓపీ ఫీజు వివరాలు, టెస్ట్‌ల చార్జ్, సిబ్బంది వివరాలతో కూడిన బోర్డులు వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ప్రైవేటు హాస్పిటల్ యాజమానులు, డాక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. దవాఖానకు సంబంధించిన అన్ని వివరాల బోర్డులను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రదర్శించాలని సూచించారు. హాస్పిటల్స్ తనిఖీ చేయటానికి ఒక టీమ్‌ను ఏర్పాటు చేస్తామని, వారం రోజుల్లో ఈ పని పూర్తి చేయాలని తెలిపారు. ప్రొవిజనల్ పత్రం కోసం క్షేత్ర స్థాయి పరిశీలన అవసరం లేదని, డీఎంహెచ్ఓ ద్వారా పొందవచ్చని చెప్పారు. అనుమతులు లేకుండా ఆస్పత్రి నడిపితే రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్‌లు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. గడువు తీరిన హాస్పిటల్ పునరుద్ధరణ కోసం అనుమతి పత్రాలు పొందేందుకు ఈ నెల 31 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎంహెచ్ఓ కోటాచలం, డాక్టర్లు శ్రీకాంత్, వెంటేశ్వర్లు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన
పొంగిపొర్లుతున్న మూసీ

- పోచంపల్లి-బీబీనగర్ మధ్య రాకపోకలు బంద్
- సంగెం భీమలింగం కత్వా వద్ద కూడా ఇదే పరిస్థితి
- యాదగిరిగుట్టలో అత్యధికంగా 17 సెంటీమీటర్ల వర్షపాతం

బీబీనగర్ : రుద్రవెల్లి మూసీ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ)/ భువనగిరి కలెక్టరేట్: జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా దంచికొట్టింది. భువనగిరి పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భూదాన్‌పోచంపల్లి నుంచి బీబీనగర్ వెళ్లే మార్గంలో రుద్రవెల్లి దగ్గర మూసీ నది పొంగిపొర్లుతున్నది. దాంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఆ మార్గం మీదుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వలిగొండ మండలం సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వా లోలెవల్ వంతెనపై నుంచి మూసీ ప్రవహిస్తుండడంతో సంగెం-బొల్లేపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భూదాన్‌పోచంపల్లి నుంచి పెద్దరాలపల్లి మీదుగా బీబీనగర్‌కు వెళ్తున్నారు. భారీ వర్షంతో గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు రోడ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అత్యధికంగా యాదగిరిగుట్టలో 17 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భువనగిరిలో 13.2, బొమ్మలరామారంలో 9.9, మోటకొండూరులో 9.5, ఆలేరులో 6.8, నారాయణపురంలో 6.8, ఆలేరులో 6.8, తుర్కపల్లిలో 5.6, రాజాపేటలో 3.9, చౌటుప్పల్‌లో 3.3, ఆత్మకూరు(ఎం)లో 3.2, భూదాన్‌పోచంపల్లి 2.3, బీబీనగర్‌లో 1.9, గుండాలలో 1.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

70మందిలో 20మందికే రుణమాఫీ

నర్సింహులగూడెంలో ఇదీ పరిస్థితి

'నేను లక్షా 90 వేలు పంట రుణం తీసుకున్నా. మిత్తితో కలిపి రెండు లక్షల 50 వేల వరకు అయ్యింది. నాకు రెండు లక్షలు మాఫీ అవుతుందనుకున్నా. కానీ లిస్టులో నా పేరు లేదు. 50 వేలు కడితే రుణమాఫీ అవుతుందేమో అని అంటున్నారు. రుణమాఫీపై రైతులను ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నది. మా ఊళ్లో 70 రైతులు లోన్ తీసుకుంటే 20 మందికే రుణమాఫీ అయ్యింది. అందరూ చిన్న, సన్నకారు రైతులే. పెట్టుబడుల కోసం సొసైటీలో రుణాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ ప్రకటించటంతో చాలామంది రైతులు సంతోష పడ్డారు. ఇప్పుడు లిస్టులో పేర్లు రాలేదని అధికారులను అడిగితే అనేక కారణాలు చెబుతున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం రైతులందరికీ రుణమాఫీ అయ్యే దారి కనిపించడం లేదు'

– నాగారం మండలం నర్సింహులగూడేనికి చెందిన రైతు తరాల ఆంజనేయులు ఆవేదన ఇది

4,731 మందికిగానూ 3,011మందికే రుణమాఫీ

- తుంగతుర్తి నియోజకవర్గంలో తూ.తూ.మంత్రమే..

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలోని చాలా గ్రామాలది నర్సింహులగూడెం పరిస్థితే. నియోజకవర్గంలో 4,731 మందిని రుణమాఫీకి అర్హులుగా జాబితాలో పేర్కొనగా.. 3,011 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. ఇంకా 1,720 మందికి రావాల్సి ఉంది. రుణమాఫీ అందని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం రావడం లేదు. మూడో విడుతలోనైనా రుణమాఫీ అవుతుందేమోనని ఎదురుచూసిన రైతుల ఆశలు అడియాశలే అయ్యాయి. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని, తిరిగి దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. తిరుమలగిరి పీఏసీఎస్ సొసైటీలో మూడు విడుతల్లో కలిపి 600 మందికి కాలేదు. తుంగతుర్తి సొసైటీలో 270 మందికి, నూతనకల్ సొసైటీలో 500 మందికి.. జాజిరెడ్డిగూడం సొసైటీలో 350 మందికి రుణమాఫీ కావాల్సి ఉంది.

రుణమాఫీ అంతా మాయ

నేను కెనరా బ్యాంకులో 67 వేలు పంట రుణం తీసుకున్నా. నాకు రుణమాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే తెలియదు.. వ్యవసాయ అధికారులను అడగండి అంటున్నరు. వాళ్ల దగ్గరికిపోతే మా చేతిలో ఏమీ లేదని పొంతన లేని సమాధానం చెప్తున్నరు. ఇలా ఆఫీసులు చుట్టూ తిరుతున్నా సరైన సమాధానం దొరుకడం లేదు. ప్రభుత్వం చెప్పే దానికి, వాస్తవ పరిస్థితికి పొంతన ఉండడం లేదు. రుణమాఫీ అంతా మాయ లెక్కనే ఉంది. రైతులకు న్యాయం చేయకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతాం.

–మిర్యాల వెంకన్న, రైతు, పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం

మాసాయిపేటలో సగం మందికే రుణమాఫీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 20 : రుణమాఫీ విషయంలో యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేటకు దోఖా జరిగింది. దాదాపు 50 శాతం మందికి రైతులకు రుణమాఫీ కాలేదు. దాంతో మేమేం పాపం చేశామంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. తీసుకున్న రుణం మాఫీ కాకపోవడం, పంట పెట్టుబడి సాయం అందకపోవడంతో కాంగ్రెస్ సర్కారు మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాదగిరిగుట్ట మండలంలో 1,429 మంది రైతులు ఉండగా 3,674 ఎకరాల భూమి సాగులో ఉంది. 90 శాతం మంది వివిధ బ్యాంకుల్లో రుణం తీసుకోగా సగానికిపైగా రైతులకు రుణమాఫీ కాలేదు.

రైతు వంటేరు ఇంద్రసేనారెడ్డి

ఈ ప్రభుత్వానికి రైతులు కనిపించడం లేదు

నేను మా ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. గతేడాది బ్యాంకులో లక్షా 60 వేలు పంట రుణం తీసుకున్నా. అందరికీ రుణమాఫీ జరుగుతుందని మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చిన రోజే రుణమాఫీ చేస్తామని చెప్పి 9 నెలలు గడిపింది. ఇప్పుడు అరకొరగా రుణమాఫీ చేసింది. 2 లక్షల లోపు రైతులకు మూడో విడుత రుణమాఫీ చేస్తామని చెప్పినా నా పేరు జాబితాలో రాలేదు. మేం రైతులం కాదా? ఈ ప్రభుత్వానికి రైతులాగా కనిపించడం లేదా? మా ఊళ్లో చాలా మందికి రుణమాఫీ కాలేదు.

–వంటేరు ఇంద్ర సేనారెడ్డి, మాసాయిపేట

నేరేడుచర్ల పీఏసీఎస్ కార్యాలయం

నేరేడుచర్ల మండలంలో సగం మందికి లోపే రుణమాఫీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలో పంట రుణాలు తీసుకున్న సగం మంది లోపు రైతులకే రుణమాఫీ అయ్యింది. మండలంలో చిల్లేపల్లి, పెంచికల్‌దిన్నె, నేరేడుచర్లలో సహకార సంఘం సొసైటీలు ఉన్నాయి. వాటితోపాటు గ్రామీణ వికాస్, కెనరా, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంకుల్లో కలిసి 2,007 మంది రైతులు క్రాప్‌లోన్లు తీసుకున్నారు. 2,007 మంది రైతుల్లో 1,152 మందికి రుణమాఫీ కాగా 855మందికి నిరాశే ఎదురైంది. తొలి జాబితాలో మొదలైన కోతలు చివరి వరకూ కొనసాగాయి. అర్హత ఉన్నా తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమాధానం దొరుకడం లేదు.

రుణమాఫీ సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 20 : పంట రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ, పరిష్కారం కోసం జిల్లాతోపాటు మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ మంగళవారం తెలిపారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకు లోన్ అకౌంట్, పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌ను అప్లికేషన్ ఫామ్‌కు జత చేసి మండల వ్యవసాయ అధికారి, నోడల్ ఆఫీసర్‌కు అందించాలని సూచించారు. రూ.2 లక్షల కంటే తక్కువ రుణం తీసుకున్న వారు వడ్డీ కలిపి మొత్తం రెండు లక్షలు దాటితే వడ్డీ డబ్బులు రైతులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. అసలు మాఫీ అవుతుందని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు టోల్‌ఫ్రీ 08685 293312 నంబరును గానీ, జిల్లా నోడల్ అధికారి రాజేశ్ నెంబర్ 72888 78411ను సంప్రదించాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నోడల్ అధికారులు.. ఫోన్ నంబర్లు

మండలం	అధికారి	మొబైల్ నంబర్
భువనగిరి	డి.మల్లేశ్	86397 78145
బీబీనగర్	సీహెచ్.పద్మ	72888 94197
పోచంపల్లి	కె.శైలజ	72888 94187
వలిగొండ	బి.అంజనీదేవి	72888 94188
నారాయణపురం	జె.ఉమారాణి	72888 94514
చౌటుప్పల్	ఎం.నాగరాజు	72888 94513
రామన్నపేట	ఎండీ అజాజ్‌అలీఖాన్	90009 78601
యాదగిరిగుట్ట	సుధారాణి	72888 94194
రాజాపేట	ఎం.అపర్ణ	72888 94196
బొమ్మలరామారం	ఎన్.దుర్గేశ్వరీ	72888 94197
మోటకొండూరు	ఎం.రమాదేవి	72888 78409
తుర్కపల్లి	కె.శ్రీఉమ	72888 94195
ఆలేరు	ఎస్.పద్మజా	72888 94190
ఆత్మకూరు	బి.అరుణకుమారి	72888 94191
మోత్కూరు	వి.కీర్తి	72888 94528
అడ్డగూడూరు	పి.పాండురంగాచారి	72888 78405
గుండాల	ఎస్.శ్రీనివాసులు	94929 26264

గండ్రవానిగూడెం గుండె చెరువు

- 550 మంది రైతుల్లో 250 మందికే రుణమాఫీ

మిర్యాలగూడ, ఆగస్టు 20 : రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సగం మందికి కూడా చెయ్యడం లేదు. మాడ్గులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామంలో 550 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకోగా 250 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. 300 మందికి ఇంకా కావాల్సి ఉన్నది. దాంతో బాధితులు బ్యాంకులు, వ్యవసాయాధికారులు చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అనేక పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని రైతులు వాపోతున్నారు.

అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేను రుణమాఫీకి అర్హుడిని. అయినా రుణమాఫీ కాలేదు. నాకు వేములపల్లి ఎస్‌బీఐలో లక్షా 43 వేల రూపాయలు క్రాప్‌లోన్ ఉంది. మూడు విడుతల్లో ఏ జాబితాలోనూ నా పేరు రాలేదు. ఎన్నో కష్టాలు పడి వ్యవసాయం చేసుకుంటున్నాం. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించి ఇప్పుడు రైతులను మోసం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.

– చింతకుంట్ల లక్ష్మారెడ్డి, రైతు, గండ్రవానిగూడెం

అధికారులు చేతులెత్తేస్తున్నారు

నాకు వేములపల్లి ఎస్‌బీఐలో రూ.60వేల పంట రుణం ఉంది. మా ఇంట్లో మరో ఇద్దరికి లక్షా 20వేలు లోన్ ఉంది. కానీ ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. సన్నకారు రైతులకే రుణమాఫీ చేయని ప్రభుత్వం అందరికీ చేస్తామని చెప్తున్నది. మా ఊళ్లో నాలాంటి ఎంతో మంది పేద రైతులకు రుణమాఫీ కాలేదు.

– చింతకుంట్ల సైదిరెడ్డి, గండ్రవానిగూడెం

హనుమాన్ ఉత్సవంలో అపశ్రుతి

- షార్ట్ సర్క్యూట్‌తో ఆరుగురికి తీవ్ర గాయాలు
- నల్లగొండ జిల్లా పొగిళ్లలో ఘటన

విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డ కేలి

చందంపేట, ఆగస్టు 20 : నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామంలో హనుమాన్ ఉత్సవంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకొని పొగిళ్ల గ్రామస్తులు ఊళ్లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విద్యుత్ ప్రభను ఏర్పాటుచేశారు. రాత్రి ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని కొలుస్తూ ఆటపాటల్లో మునిగి ఉండగా ప్రభకు పైనున్న కరెంట్ తీగలు తగి షార్ట్ సర్క్యూట్ అయ్యింది. తీగలు తెగిపడడంతో జటావత్ కేలి, లక్ష్మి, తిరుపతి, నాగభూషణాచారి, ప్రతాప్, కేలికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఆరుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో దేవరకొండలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్ఐ సతీశ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు.

22న ఎంజీయూలో జాబ్ మేళా

రామగిరి, ఆగస్టు 20 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈ నెల 22న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ వై.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ప్రముఖ సంస్థలైన టెక్ మహేంద్ర, టెలీ పెర్ఫార్మెన్స్, ఇన్విసెంట్, జన్నాక్ట్ జాబ్‌మేళాకు రానున్నట్లు పేర్కొన్నారు. యూజీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్: 9010203857 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.